
ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
కరీంనగర్ 6-8-2019 మంగళవారం సిటీ సంపుటి 45 సంచిక 358 రూ. 6-50. పేజీలు 16+16 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi




## ఒకే దేశం.. ఒకే జెండా

# కశ్మీరం.. కొత్త సమీరం







## 370 అధికరణం రద్దు

### మోదీ సర్కారు సంచలన నిర్ణయం

- జమ్మూ-కశ్మీర్ విభజన బిల్లుకు రాజ్యసభ ఆమోదం
- ఇక నుంచి రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా మారనున్న రాష్ట్రం
- పలు ప్రాంతాల్లో హర్షాతిరేకాలు
- భగ్గుమన్న కాంగ్రెస్, డీఎంకే, కశ్మీర్ పార్టీలు
- సంబంధాలకు విఘాతం: పాక్

జమ్మూ-కశ్మీర్ చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలయింది. ఏదో జరగబోతోందన్న ప్రచారం నిజమయింది. కొద్ది రోజులుగా వరుసగా జరుగుతున్న పరిణామాలకు కొనసాగింపుగా ఆదివారం అర్ధరాత్రి నుంచి చోటు చేసుకున్న నాటకీయ ఘటనలతో చెలరేగిన ఉత్కంఠకు సోమవారం సాయంత్రం తెరపడింది. దశాబ్దాలుగా నలుగుతున్న కశ్మీర్ అంశంపై మోదీ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. జమ్మూ-కశ్మీర్ రాష్ట్రాన్ని రెండుగా విభజించింది. జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 అధికరణానికి ముగింపు పలికింది. దీంతో ఆ రాష్ట్రానికి ప్రత్యేక రాజ్యాంగం, అధికారాలు రద్దయ్యాయి. భారత రాజ్యాంగంలోని నిబంధనలన్నీ సంపూర్ణంగా ఈ రాష్ట్రానికీ వర్తించేందుకు వీలు కలిగింది. జమ్మూ-కశ్మీర్‌లో స్థానికతను నిర్వచించడానికి, వారికి ప్రత్యేక హక్కులు కల్పించడానికి ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఇచ్చిన 35ఎ అధికరణం కూడా ఈ చర్యతో అటకెక్కింది. ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించే పునర్వ్యవస్థీకరణ బిల్లును కూడా పార్లమెంటు ముందుకు తెచ్చింది. దీంతో జమ్మూ-కశ్మీర్ శాసనసభ కలిగిన కేంద్ర పాలిత ప్రాంతంగా, లద్దాఖ్ శాసనసభ లేని కేంద్రపాలిత ప్రాంతంగా విడిపోనున్నాయి. సోమవారం రాజ్యసభలో ఈ మేరకు కేంద్ర హోంమంత్రి తీర్మానాలు, బిల్లులను ప్రవేశపెట్టారు. సుదీర్ఘ చర్చ తర్వాత సభ వాటికి ఆమోదం తెలిపింది. ప్రభుత్వ చర్యపై కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ, వామపక్షాలు తదితర పార్టీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాయి. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయాలు అధికార భాజపా, ఆ పార్టీ మద్దతుదారుల్లో ఎనలేని ఉత్సాహాన్ని నింపాయి. జమ్మూ-కశ్మీర్‌లో ప్రధాన రాజకీయ పార్టీలైన పీడీపీ, నేషనల్ కాన్ఫరెన్స్‌లు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. రాష్ట్రంలో అగ్ర నాయకులను ఆదివారం అర్ధరాత్రి గృహ నిర్బంధంలో ఉంచిన ప్రభుత్వం సోమవారం రాత్రి వారిని అరెస్టు చేసింది. 370పై తాజా నిర్ణయం నేపథ్యంలో దేశవ్యాప్తంగా అప్రమత్తత ప్రకటించారు. మరోపక్క కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు ప్రపంచం మొత్తానికీ తెలిసినప్పటికీ జమ్మూకశ్మీర్ ప్రజల్లో ఎక్కువ మందికి ఈ వార్త చెవినపడలేదు. మొబైల్, ఇంటర్నెట్ సేవలను నిలిపి వేయడమే ఇందుకు కారణం.

...పూర్తి వివరాలు, ప్రత్యేక కథనాలు 2, 6, 7, 8, 9, 10 పేజీల్లో

| రాజ్యసభలో ఆమోదం | |
|---|---|
| మద్దతు : | 125 |
| వ్యతిరేకం: | 61 |

**కశ్మీర్ విభజన బిల్లుకు మద్దతిచ్చిన పార్టీలు**

| | | |
|---|---|---|
| • భాజపా | • బీజేడీ | • ఆప్ |
| • శివసేన | • బీఎస్పీ | • ఎస్‌డీఎఫ్ |
| • అకాలీదళ్ | • వైకాపా | • ఏజీపీ |
| • ఎల్జేపీ | • తెరాస | • ఆర్‌పీఐ |
| • ఏఐఏడీఎంకే | • తెదేపా | • ఎన్‌పీఎఫ్ |

> నాడు 370 అధికరణం తాత్కాలికమే అన్నారు. అంటే 70 ఏళ్లయినా పోకపోవడమా!
> – అమిత్ షా

**వ్యతిరేకించినవి**

| | |
|---|---|
| • కాంగ్రెస్ | • ఆర్జేడీ |
| • సీపీఐ | • ఐయూఎంఎల్ |
| • సీపీఎం | • కేరళ కాంగ్రెస్ (ఎం) |
| • సమాజ్‌వాదీ | • ఎండీఎంకే |
| • డీఎంకే | |

**వాకౌట్ చేసినవి**

- జేడీయూ
- ఎన్‌సీపీ
- తృణమూల్ కాంగ్రెస్



**ఆనందం..**

జమ్మూలో సోమవారం సంబరాలు చేసుకుంటున్న భాజపా కార్యకర్త




**ఆందోళన..**

దిల్లీలో వామపక్ష పార్టీల సభ్యులు, విద్యార్థుల నిరసనలో ప్లకార్డు ప్రదర్శిస్తున్న ఓ ఆందోళనకారుడు

### ఇక ఇలా...

- శాంతిభద్రతలు కేంద్రప్రభుత్వం నియంత్రణలోకి వస్తాయి..
- ప్రత్యేక రాజ్యాంగం లేదు. ఇతర రాష్ట్రాల మాదిరే కేంద్ర చట్టాలు ఇక్కడా వర్తిస్తాయి.
- ప్రత్యేకంగా జెండా ఉండదు, ద్వంద్వ పౌరసత్వం రద్దవుతుంది.
- 360 అధికరణం కింద కేంద్రం ఆర్థిక అత్యయిక పరిస్థితి విధించవచ్చు.
- భారత పౌరులు ఎవరైనా జమ్మూ-కశ్మీర్‌లో ఆస్తులు కొనుగోలు చేసి స్థిరపడొచ్చు.



### జరిగింది ఇలా..

ఉదయం

| | |
|---|---|
| 9:30 | ప్రధాని నివాసంలో కేంద్ర కేబినెట్ భేటీ |
| 10:51 | పార్లమెంటుకు చేరుకున్న ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా |
| 11:17 | జమ్మూ-కశ్మీర్‌కు సంబంధించి 2 బిల్లులు, 2 తీర్మానాలను రాజ్యసభ ముందు పెడుతున్నట్లు షా ప్రకటన. |
| 11:30 | భారత రాజ్యాంగం తక్షణం జమ్మూ-కశ్మీర్‌కు వర్తించేలా రాష్ట్రపతి కోవింద్ ఉత్తర్వు |
| సాయంత్రం 5:30 | జమ్మూ-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టి తిరిగి రాజ్యసభకు వచ్చిన షా. |
| 6:29 | రాజ్యసభలో ఆమోదం పొందిన జమ్మూ-కశ్మీర్ రిజర్వేషన్ బిల్లు |
| 6:50 | జమ్మూ-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం. |






# ఈనాడు

## ఇదెక్కడి న్యాయం?

అపరిష్కృత వ్యాజ్యరాశి కింద పడి సంవత్సరాల తరబడి నలిగిపోతున్న అసంఖ్యాక కక్షిదారుల దురవస్థ దేశంలో న్యాయ అవ్యవస్థను కళ్లకు కడుతోంది. న్యాయస్థానాల్లో ఏళ్లూపూళ్లూ కొనసాగుతున్న విచారణ తంతు ముగిసి కేసులు ఒక కొలిక్కి వచ్చేసరికి తరాలే మారిపోతున్న పర్యవసానంగా- ఈ గడ్డమీద సత్వర న్యాయం ఎండమావేనన్న నిరాశానిస్పృహలు జనబాహుళ్యంలో గూడు కట్టుకుంటున్నాయి. పెండింగ్ కేసుల తీవ్రత ఎంత దుస్సహ స్థితికి చేరిందో సర్వోన్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ తాజాగా ప్రస్తావించిన గణాంకాలు తెలియజెబుతున్నాయి. ఎకాయెకి రెండుకోట్ల పది లక్షల మేర క్రిమినల్ వ్యాజ్యాలు అపరిష్కృతంగా ఉన్న దేశం మనది. కోటికిపైగా కేసులలో సమన్లే జారీ కాలేదంటున్న జస్టిస్ గొగోయ్, ఇరవై అయిదు సంవత్సరాలుగా మోక్షం దక్కనివి రెండు లక్షలకు మించాయని, సుమారు వెయ్యి దావాలు యాభై ఏళ్లుగా కోర్టుల్లో గిరికీలు కొడుతూనే ఉన్నాయని నిష్ఠుర సత్యం వెల్లడించారు. మూడున్నర దశాబ్దాలుగా శ్లేష్మంలో పడ్డ ఈగల్లా గిజగిజలాడుతున్న కేసుల సంఖ్య 51వేల పైమాటేనన్న గణాంక విశ్లేషణ ఆరు నెలల కిందట వెలుగుచూసింది. జాతీయ న్యాయ సమాచార గ్రిడ్ క్రోడీకరించిన వివరాల ప్రకారం, ఒక్క సుప్రీంకోర్టులోనే పెండింగ్ కేసులు 58వేలకు పైబడగా- దిగువన జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో రెండుకోట్ల 70లక్షలదాకా అపరిష్కృత వ్యాజ్యాలు పోగుపడి ఉన్నాయి. పదేళ్లకుపైగా పెద్దయెత్తున పెండింగ్ కేసులు పేరుకుపోయిన జాబితాలో అలహాబాద్, బాంబే, పంజాబ్-హరియాణా, కలకత్తా, రాజస్థాన్, మధ్యప్రదేశ్ హైకోర్టులు ముందున్నాయి. దిద్దుబాటు చర్యలు చురుకందుకొనకపోతే ఇంకో రెండు దశాబ్దాల్లో దేశీయంగా పెండింగ్ కేసుల సంఖ్య 15కోట్లకు పెచ్చరిల్లుతుందంటున్నా- న్యాయసంస్కరణల ప్రక్రియ పడకేయడం... ఇదెక్కడి న్యాయం?

భారత రాజ్యాంగంలోని 39 ఏ అధికరణ 'ఏ కారణంగానైనా ప్రజానీకానికి న్యాయం దుర్లభం కాకుండా ప్రభుత్వమే కాచుకోవా'లని స్పష్టీకరిస్తోంది. దురదృష్టవశాత్తు, జనబాహుళ్యానికి సత్వర న్యాయం దక్కనివ్వకుండా ప్రధానంగా సర్కారీ యంత్రాంగమే సైంధవ పాత్ర పోషిస్తోంది. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్లు న్యాయమూర్తులు, కోర్టుల సంఖ్య ఎప్పటికప్పుడు విస్తరించేలా వ్యవస్థాగత ఏర్పాట్లు కొరవడటం లక్షలాది కక్షిదారుల కుటుంబాల్లో ఆరని వేదనాగ్నులు రగిలిస్తోంది. ప్రతి పది లక్షల జనాభాకు ఫ్రాన్స్‌లో 124మంది, అమెరికాలో 108 మంది న్యాయమూర్తులు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతి పది లక్షల భారతీయులకు 50మంది చొప్పున న్యాయాధీశులు కొలువు తీరాలని లా కమిషన్ 1987లోనే సిఫార్సు చేసినా, ఇప్పటికీ ఆ నిష్పత్తి 20లోపే తచ్చాడుతోంది. మున్సిఫ్ జడ్జి మొదలు సుప్రీంకోర్టు న్యాయమూర్తి వరకు ఏటా సగటున తలా రెండున్నర వేలకు పైగా తీర్పులిస్తున్నా కరగని పెండింగ్ కొండల పని పట్టడానికి- 70వేల మంది వరకు న్యాయాధీశులు అవసరమవుతారన్నది, జస్టిస్ టీఎస్ ఠాకుర్ మూడేళ్లక్రితం చెప్పిన లెక్క. సర్వోన్నత న్యాయస్థానం నుంచి దిగువ కోర్టు దాకా మంజూరైన కొలువులే దాదాపు 24 వేలు. అందులోనూ ఖాళీలు భర్తీ కాకపోవడం, దేశంలో పెను న్యాయ సంక్షోభ మూలాల ఆనవాళ్లను పట్టిస్తోంది. న్యాయమూర్తులు, ఇతరత్రా సిబ్బంది నియామకాలు తగినంతగా వేగం పుంజుకొనకపోవడంతోపాటు మరో రెండు కీలకాంశాలకు సంబంధించిన వైఫల్యాలూ న్యాయార్థుల్ని మానసికంగా, ఆర్థికంగా పీల్చి పిప్పి చేస్తున్నాయి.

కోర్టు గుమ్మం తొక్కకముందే సామరస్యపూర్వకంగా వివాద పరిష్కరణ యత్నాలు; కేసు నమోదయ్యాక దర్యాప్తు, విచారణ వేగిరం పూర్తయ్యేలా పకడ్బందీ విధివిధానాల కూర్పు, అమలు- అన్నింటా వైఫల్యం మూలాన దేశంలో పెండింగ్ కొండలు ఇంతలంతలవుతున్నాయి. అమెరికాలో 90శాతం మేర సివిల్ కేసుల్ని మధ్యవర్తిత్వ మార్గంలోనే చక్కబెడుతున్నారు. వివిధ కోర్టుల కంప్యూటరీకరణ, వాటి అనుసంధానం చేపట్టిన జన చైనా మూడు నెలల గడువులో విచారణ, శిక్షల ఖరారు తెమిలిపోయేలా జాగ్రత్తలు తీసుకుంటోంది. అదే ఇక్కడ, వకీళ్లు కోరడమే తడవుగా కేసులు వాయిదాలపై వాయిదాలు పడటం పరిపాటిగా మారింది. రాజకీయ కక్షతో, పన్నులూ రుణాల ఎగవేతే లక్ష్యంగా ఎడాపెడా దాఖలయ్యే వ్యాజ్యాల వడపోత అధికారాన్ని కోర్టులకు కట్టబెట్టాలని దశాబ్దం క్రితమే న్యాయ సంఘం సూచించినా ఒరిగిందేముంది? రకరకాల కారణాలతో కొన్నేళ్లపాటు కేసులు అపరిష్కృతంగా ఉండిపోకుండా ప్రతి హైకోర్టులోనూ ప్రత్యేక విభాగం నెలకొల్పాలన్న మలీమత్ కమిటీ సిఫార్సుల స్ఫూర్తి ఆచరణలో కొల్లబోతోంది. ప్రభుత్వం బాధ్యతాయుత కక్షిదారుగా మెలగేలా ఆస్ట్రేలియా రూపొందించిన విస్తృత మార్గదర్శకాల సరళి ఎవరికైనా శిరోధార్యం. మధ్యవర్తిత్వ విధానాన్ని ప్రోత్సహించి, వాయిదాల సంస్కృతిపై వేటు వేసి; బ్రిటన్ తరహాలో పౌర న్యాయ ప్రక్రియ నిబంధనల్ని సరళీకరించి, కేసుల నిర్వహణలో మార్గదర్శకాలు క్రోడీకరించి అమలుపరచడమే- ఇప్పుడు దేశీయంగా అనుసరణీయ మార్గం. అందుకు ప్రజాప్రభుత్వాలు తు.చ. తప్పక కట్టుబాటు చాటి, నిబద్ధ కృషి సాగిస్తేనే- వ్యాజ్యాల పరిష్కరణ కాలావధి గణనీయంగా తగ్గుతుంది. కక్షిదారులపై వ్యయభారమూ కనిష్ఠ స్థాయికి దిగివస్తుంది. కొరగాని చట్టాల్ని మూసిపెట్టి, కాలం చెల్లిన విచారణ పద్ధతులకు చెల్లుకొట్టే సమగ్ర సంస్కరణలే కక్షిదారులకు సంపూర్ణంగా న్యాయం ప్రసాదించగలిగేది!

---

ప్రపంచంలో ప్రతి దేశానికీ తనదైన వారసత్వ చరిత్ర ఉంటుంది. అది తమకు గర్వకారణమని ఆయా దేశాల ప్రజలు భావిస్తుంటారు. ఆ ఘన చరిత్ర ఆనవాళ్లను ప్రపంచానికి చూపించాలని; తద్వారా గుర్తింపు, గౌరవం, ఆదాయం సమకూర్చుకోవాలని ప్రతి దేశం అనుకోవడం సహజం. ప్రపంచంలో ఏటా 150 కోట్లకు పైగా పర్యాటకులు వివిధదేశాలు సందర్శిస్తున్నారు. వారిలో కోటి మంది మాత్రమే భారత్‌లో పర్యటిస్తున్నారు. సహజంగా వీరిలో సమీప దేశాలవారే ఎక్కువగా ఉంటారు. ఈ సంఖ్య పెరగడానికి పుష్కలమైన అవకాశాలున్నాయి. వచ్చే పదేళ్లలో పర్యాటకుల సంఖ్యను మరింత పెంచాలన్నది కేంద్ర ప్రభుత్వ ఆలోచన.

# ఉదాసీనత వీడితే ఉపాధికి ఊతం



పర్యాటకులకు కావలసింది భద్రత, పరిశుభ్రత. ఈ పరిస్థితులను చక్కదిద్దకుండా పర్యాటక రంగం ముందుకు పోలేదన్న వాస్తవాన్ని గ్రహించాలి. ప్రకృతిపరంగా దేశంలో ఉన్న సుందర ప్రదేశాలను పరిశుభ్రంగా నిర్వహించుకోవడం అత్యంత ముఖ్యం. భారతీయులు ఎక్కువగా తమ దేశంలోని ప్రదేశాలనే సందర్శిస్తుంటారు. పర్యాటకం మంచి ఆదాయ వనరుగా మారింది. దీనివల్ల రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు మంచి ఆదాయం లభిస్తోంది. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలకన్నా ఇందులో పని తక్కువ, ఆదాయం ఎక్కువ. పర్యాటక రంగం వృద్ధి చెందితే ప్రజల్లో ఆయా అంశాలపై అవగాహన, విజ్ఞానం పెరుగుతాయి. అందువల్లే వివిధ దేశాలు ఈ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రచించుకుంటున్నాయి. పర్యాటకుల సంఖ్య ప్రకారం భారత్ మొదటి మూడు స్థానాల్లో ఉన్నా ప్రమాణాల స్థాయిలో మాత్రం అడుగున ఉంది. ఇది ఆందోళన కలిగించే అంశం. ఈ లోపాలను సరిదిద్దుకున్నట్లయితే పర్యాటకంలో దేశం దూసుకుపోగలదు.

భారతదేశ చరిత్ర, సంస్కృతి ప్రత్యేకమైనవని ప్రపంచం గుర్తించింది. ఎవరి దేశచరిత్ర వారికి గొప్పదైనా, భారతీయుల చరిత్ర ఇతర చరిత్రలు ఇవ్వలేని గొప్ప సందేశాలను అందించింది. క్రీ.పూ. మూడో శతాబ్దంలో అశోక చక్రవర్తి నేటి ఒడిశా రాష్ట్ర రాజధాని నగరం భువనేశ్వర్ దగ్గర గల దయా నది ఒడ్డున వేయించిన శాసనపాఠం ఇందుకు ఉదాహరణ. రెండో ప్రపంచ యుద్ధం తరవాత 1940లలో ఐక్యరాజ్యసమితి ఆవిర్భవించినప్పుడు నాటి ముసాయిదాలో ఏమి రాశారో అవే మాటలను సుమారు 2250 సంవత్సరాల ముందే అశోకుడు రాయించాడు. యుద్ధాలు లేకుండా అందరం ప్రశాంతంగా బతుకుదామని, యుద్ధాలవల్ల నష్టమే ఎక్కువని, మనుషులే కాక వన్యమృగాలు సైతం స్వేచ్ఛగా ఉండాలని అలనాటి శాసనంలో అశోకుడు పేర్కొన్నాడు. ఇవే మాటలను ప్రపంచదేశాలు ఇప్పుడు మరోసారి గుర్తు చేసుకుంటున్నాయి.

### వలసవాదులకు ఊరట

ప్రపంచ చరిత్రలో అలెగ్జాండర్, జూలియస్ సీజర్, చెంఘిజ్ ఖాన్‌లకు గొప్పవారన్న పేరుంది. అయితే వారి చేతిలోనే లక్షలమంది మృతిచెందారన్న విషయాన్ని మరచిపోరాదు. భారత్ మాత్రం- యుద్ధాలు వద్దన్న అశోకుడిని, అధికారాన్ని త్యజించిన మహావీరుడిని, నిర్వాణ మార్గాన్ని చూపిన గౌతమ బుద్ధుడిని, మత సామరస్యాన్ని కాంక్షించి దీన్-ఇ-ఇలాహిని స్థాపించిన అక్బర్‌ను, ఆయుధాలు లేకుండా స్వాతంత్య్రాన్ని సాధించిన గాంధీని గొప్పవారని కీర్తించింది. అదే భారత్ ప్రత్యేకత. అందువల్లనే ప్రపంచ దేశాల్లో భారతీయ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభించాయి. పశ్చిమాసియా నుంచి వచ్చిన పార్సీలను, జొరాస్ట్రియులను, ఏనాడో వచ్చిన యూదులను, ఏడో శతాబ్దిలోనే వచ్చిన నూతన మహమ్మదీయులను భారత్ అక్కున చేర్చుకుంది. ఈ ఒరవడి దేశ చరిత్రలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. మూడువేల సంవత్సరాల నాటి చారిత్రక శిథిలాలు, సాహిత్యం, జ్ఞాపకాలు... భారత్ ఆస్తి. ఇవి దేశ వారసత్వ సంపదకు చిహ్నాలుగా నిలుస్తున్నాయి.

### పన్నుపోటుతో పాట్లు

పర్యాటకరంగానికి ఉన్న ప్రతిబంధకాల్లో వస్తుసేవల పన్ను (జి.ఎస్.టి.) ఒకటి. ఇది పర్యాటకరంగంపై 28 శాతంగా ఉంది. దీనికి అదనంగా హోటళ్లలో మరో అయిదు శాతం వడ్డిస్తున్నారు. మొత్తానికి 33 శాతం పన్ను పడుతోంది. ఫలితంగా ఇటీవలి కాలంలో పర్యాటక ఆదాయం తగ్గిపోతోంది. ఇంత పన్ను కడుతున్నా ఆ మేరకు సేవలు అందడం లేదన్న పర్యాటకుల అభిప్రాయాన్ని తోసిపుచ్చలేం. ఏ దేశంలోనూ జీఎస్‌టీ ఇంత స్థాయిలో లేదు. థాయ్‌లాండ్, మలేసియాల్లో ఆరు, చైనాలో అయిదు, అత్యధికంగా ఇటలీలో పదిశాతం జీఎస్‌టీ ఉంది. అందువల్ల దేశీయంగా పన్ను శాతాన్ని తగ్గించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.





### వారసత్వ సంపద పరిరక్షణ పట్టని ప్రభుత్వాలు

ఆఫ్రికా ఖండంలోని ఈజిప్ట్ ఏడాది పొడుగునా పర్యాటకులతో కిటకిటలాడుతుంటుంది. ఆ దేశ ఆర్థిక రంగానికి పర్యాటకమే ప్రాణవాయువు. 11 శాతం ఆదాయం దీని నుంచే వస్తుంది. లక్షలమందికి ఉద్యోగాలు వచ్చాయి. ఈజిప్ట్‌లోని చారిత్రక స్థలాలు, కట్టడాలు అక్కడి ప్రజల వారసత్వంలా కనిపించవు. నైలునదీ నాగరికత వారసులు ఎవరో నేటికీ తెలియదు. ఆ దేవతలను పూజించే వారూ లేరు. అంతమాత్రాన ఈజిప్ట్ ప్రభుత్వం అవి తమవి కాదని, వాటి నిర్వహణతో తమకు సంబంధం లేదని ఎప్పుడూ చెప్పలేదు. అది ఆ ప్రాంత సాంస్కృతిక, చారిత్రక వారసత్వం. ఏ దేశ చరిత్ర అయినా ఆ దేశానికే సొంతం కాదు. అది ప్రపంచ వారసత్వం కూడా. దేశాల సరిహద్దులు మనం గీసుకున్నవి. అవి దీర్ఘకాలంలో స్థిరమైనవి కావు. అఫ్గానిస్థాన్‌లో బమియాన్ భారీ బుద్ధ విగ్రహాలను ఉగ్రవాదులు ఫిరంగులు పెట్టి పేల్చివేసినప్పుడు యావత్ ప్రపంచం విస్తుపోయింది. బమియన్ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్ది ఉంటే వివిధ దేశాల నుంచి సందర్శకులు వచ్చేవారు. ఏటా వారి సంఖ్య పెరిగేది. ఆదాయం లభించేది. తద్వారా అఫ్గానిస్థాన్ అభివృద్ధి చెందేది. అక్కడి చరిత్ర ప్రపంచానికి తెలిసేది. అందుకు భిన్నమార్గంలో వెళ్లడం వల్ల చివరికి అఫ్గాన్ నష్టపోయింది.

భారత పర్యాటక రంగం దేశ స్థూల ఉత్పత్తిలో పదిశాతం పైనే ఆదాయాన్ని సమకూరుస్తోంది. 12 శాతం ఉద్యోగాలనూ సృష్టించింది. అధిక శాతం పర్యాటకులు బౌద్ధస్థలాలను, మొఘల్ వారసత్వ స్థలాలనే సందర్శిస్తున్నారు. కౌశాంబి, శ్రావస్తి, నలంద, గయ, సారనాథ్, కుసీనారా తదితర బౌద్ధక్షేత్రాలు ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలుగా గుర్తింపుపొందాయి. తాజ్‌మహల్, హుమాయూన్ సమాధి, దిల్లీ, ఆగ్రా ఎర్రకోటలు, ఫతేపూర్ సిక్రి... అదే స్థాయిలో ప్రాచుర్యం పొందాయి. వీటిని చూడటానికి నిత్యం పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. హైదరాబాదుకు చార్మినారు, ముంబయికి గేట్‌వే ఆఫ్ ఇండియా, కోల్‌కతాకు హౌరా వంతెన, దిల్లీకి ఎర్రకోట పర్యాటక ప్రదేశాలుగా ఉన్నాయి. యునెస్కో గుర్తించిన వారసత్వ ప్రదేశాలు 38 ఉన్నా, వాటిలోని మొదటి అయిదులో మొఘల్ చిహ్నాలే కావడం విశేషం.

### ఆకట్టుకుంటున్న ఆలయాలు

తాజ్‌మహల్ కట్టడానికి ఆ రోజుల్లో (17వ శతాబ్దంలో) దాదాపు మూడుకోట్ల ఇరవై లక్షల రూపాయలు ఖర్చయింది. ప్రస్తుత లెక్కల ప్రకారం రూ.300 కోట్లు కావచ్చు. తాజ్ పర్యాటకులు సంవత్సరానికి దాదాపు 70 లక్షల పైమాటే. రోజుకు 40,000 మందికి మించి తాజ్ ఆవరణలోకి అనుమతించరాదనే ఆలోచనలో పురాతత్వ శాఖ ఉంది. తాజ్‌మహల్‌ను విదేశీ పర్యాటకులే దాదాపు ఎనిమిది లక్షలమంది సందర్శిస్తున్నారు. ఆగ్రాలో ఎర్రకోట, తాజ్‌మహల్‌లకు వీరు చెల్లించే ప్రవేశరుసుమే సంవత్సరానికి సుమారు రు.100 కోట్లు. 2017-18 సంవత్సరానికి వచ్చిన రూ.271 కోట్ల ఆదాయంలో రూ.146 కోట్లు తాజ్‌మహల్, ఆగ్రా డిల్లీ ఎర్రకోటలు, ఫతేపూర్ సిక్రి, కుతుబ్‌మీనార్ సందర్శకుల నుంచే వచ్చింది. వీటిలో కుతుబ్‌మీనార్ మాత్రమే డిల్లీ సుల్తానులు నిర్మించింది. మిగిలినవన్నీ మొఘల్ సామ్రాజ్య చిహ్నాలే. అజంతా, ఎల్లోరా, పూరీ, కోణార్క, పట్టడకల్, హంపి, ఖజురహో, తమిళనాడులోని ఆలయాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఆగ్రా, దిల్లీలు ఆదాయంలో అగ్రస్థానాన ఉన్నాయి. ఈ కట్టడాలను పరిరక్షించడం ప్రభుత్వాల బాధ్యతని చరిత్రకారులు గుర్తు చేస్తున్నారు.

దేశంలో వ్యవసాయం తరవాత ఎక్కువ మందికి ఉపాధి లభించేది పర్యాటక రంగంలోనే అన్నది కేంద్ర పర్యాటక మంత్రి అల్ఫోన్స్ జోసెఫ్ కన్నంధానమ్ అభిప్రాయం. దేశంలో దాదాపు ఎనిమిది కోట్ల ప్రజలు పర్యాటకంపై ఆధారపడుతున్నారు. పన్నెండు శాతం పౌరులకు ఉపాధి కల్పిస్తున్న రంగమిది. గత సంవత్సరం రూ.1,77,000 కోట్ల విదేశ మారక ద్రవ్యం ఈ రంగం నుంచే లభించిందని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించిన 38 స్థలాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. వారసత్వ ప్రదేశాల్లో అత్యధికం బౌద్ధ, మొఘల్ వారసత్వానికి చెందినవే. వీటిని పరిరక్షించడంతోపాటు మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి. దీనితోపాటు చరిత్ర ఆధారంగా కొత్త కట్టడాలను గుర్తించడంతోపాటు వాటికి నూతన అందాలు సమకూర్చాల్సిన అవసరం ఉంది. తద్వారా సందర్శకులను ఆకట్టుకోవచ్చు. ప్రచారం ద్వారా విదేశీ యాత్రికులనూ ఆకర్షించవచ్చు. ఫలితంగా పర్యాటక రంగం కళకళలాడటంతోపాటు ఆదాయ వనరులు, ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయి!

– డాక్టర్ పి.వి.రంగనాయకులు

(రచయిత– తిరుమల ఎస్వీ మ్యూజియం మాజీ సంచాలకులు)

---

# బకాసురుడి బాబులు

'భీమా... రా బయటికి; ధర్మనందనా, నువ్వూ రా. న్యాయం చెప్పు!' స్వర్గ ద్వారం బయట అరుపులు. దాంతో లోపల ఒక్కసారిగా అలజడి. రంభ, ఊర్వశి, మేనక నృత్యాలు ఆపేశారు. అంతా నిశ్శబ్దం.

'ఓయ్ పెద్దమనుషులూ, రండయ్యా' ఈసారి ఇంకా గట్టిగా మోగాయా గొంతులు. ధర్మరాజు, వెనకే భీముడు వచ్చారు. చూస్తే ఏముందీ... కోరపళ్లు, జారిపోయిన కొండ పొట్టలు, జంతు చర్మ వస్త్రాలతో బకాసురుడు, హిడింబాసురుడు, కిమ్మీరుడు... కనిపించారు.

భీముడికి కోపం తన్నుకొచ్చింది. 'ఏంటి మీ గోల. నరకంలో శిక్షలు సరిపోవడంలేదా? ఇంకా నాలుగు తగిలించాలా?' పళ్లు కొరుకుతూ అన్నాడు.

'చాలు చాల్లేవయ్యా నీ గద్దింపులు. మొన్న తహశీల్దారు ఇంట్లో దొరికిన 93 లక్షల రూపాయలు లెక్కబెట్టడానికి నిన్ను పంపిస్తే తెలిసేది మా మంచితనం' పౌరుషంగా అన్నాడు బకాసురుడు.

'అంతే కాదన్నా, అవినీతి నిరోధక శాఖ అధికారుల వెంట ఐతగాణ్ని తిప్పి, దొంగ ఆస్తులు లెక్కేయిస్తేగానీ మన మంచి మనసు తెలిసిరాదు' అన్నాడు కిమ్మీరుడు గడ్డం మిటకరిస్తూ.

'ఏంటీ, మనుషుల్ని పీక్కుతినే మీరు మంచితనం, మనసు గురించి మాట్లాడుతున్నారా?' కటువుగా అంటూ రెండడుగులు ముందుకేశాడు భీముడు. ఆ రాక్షసులు ముగ్గురూ కాస్త భయపడ్డారు. అంతలో భీముణ్ని వారిస్తూ, 'అసలేంటి మీ బాధ' అన్నాడు ధర్మనందనుడు చిరునవ్వు చిందిస్తూ. దాంతో వాళ్లకు కొంత ధైర్యం వచ్చింది. 'యుధిష్ఠిరా, నేనే తలచుకునుంటే ఆనాడు ఏకచక్రపురం ప్రజల్ని రెండు రోజుల్లో లాగించేసి ఉండేవాణ్ని. కానీ, వాళ్ల వేడుకోళ్లతో నా మనసు కరిగింది. రోజుకొక మనిషి చొప్పున నా ఆకలిని త్యాగం చేశాను. కానీ, ఇప్పుడు భారతదేశంలో అవినీతి ప్రభుత్వాధికారుల్ని చూడు... జాలి దయ లేకుండా ప్రజల్ని ఎలా పీక్కుతింటున్నారో, వాళ్లు చేస్తున్న దాంతో పోలిస్తే నేను చేసింది పెద్ద లెక్కా. నీ తమ్ముడు నన్ను చంపడం సరైన లెక్కా?' బకాసురుడు కళ్లొత్తుకున్నాడు.


'నా మానాన నేనెక్కడో అడవిలో దొరికిన వాళ్లతో ఆకలి తీర్చుకుంటూ ఉండేవాణ్ని. అడవి దాటి బయటికి పోయింది లేదు. నా ప్రాంతానికే వచ్చి నన్ను చంపేశాడు నీ తమ్ముడు. ఇప్పటి అవినీతి అధికారులతో పోలిస్తే నేను చేసినవి పెద్ద పాపాలా? అసలు వీళ్లకు నియమాలూ నిబంధనలంటూ ఉన్నాయా?' ముక్కు చీదాడు హిడింబాసురుడు.

'అయితే ఇప్పుడేమంటారు?' అన్నాడు భీముడు కళ్లు పెద్దవిచేస్తూ.

'ఇంకా ఏంటయ్యా అనేది. హిడింబాసురుడి లాగే నన్నుకూడా మట్టుపెట్టావు. దుర్మార్గులమని, రాక్షసులమని మమ్మల్ని చంపేశావు. ఇప్పుడు భరతవర్షంలో అవినీతి అధికారులు మాకన్నా ఘోరంగా, దుర్మార్గంగా తయారయ్యారు. ఏమాత్రం జాలి, దయ లేకుండా లంచాలంటూ ప్రజల్ని పీక్కుతింటున్నారు' కళ్లొత్తుకున్నాడు కిమ్మీరుడు.

'వాళ్లకు బుద్ధిచెప్పడానికి చట్టాలు, ఏసీబీ ఉన్నాయిగా?' అన్నాడు పాండవాగ్రజుడు.

ఆ మాటలకు బకాసురుడు బొజ్జను రెండు చేతుల్తో పట్టుకొని పెద్దపెట్టున నవ్వాడు. 'నువ్వెక్కడి మాలోకానివయ్యా బాబూ. మీ తమ్ముడు మమ్మల్ని చంపేసిన తరవాత మళ్లీ మా అంశతో రాక్షసులు భూమ్మీద పుట్టారా? లేదు కదా! మరి ఏసీబీ అధికారులు అరెస్టులు చేస్తూనే ఉన్నా... ఇంకా లంచావతారులు ఎందుకు పెరిగిపోతున్నారు? పేదలు ఇంకా భోరున ఎందుకేడుస్తున్నారు? అరెస్టు చేసిన తరవాతా ఆ అయ్యామ్మలరా



యుళ్లు ఏసీబీని ముప్పుతిప్పలు పెడుతున్నారు తెలుసా? అరెస్టయితే మహా ఏమవుతుందయ్యా, కొన్నాళ్లు సస్పెండ్ చేస్తారు. మళ్లీ ఉద్యోగంలో చేరి దందా మొదలుపెడతారు. అసలు... అరెస్టయిన వాళ్లలో ఎంతమందికయ్యా శిక్షలు పడుతున్నాయి? తెలియకుండా చట్టాలు అని మాట్లాడొద్దు... కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుందని అంటారు. వీళ్ల కడుపులు చించితే లోకమే మునిగిపోతుందయ్యా స్వామీ. అంతలా మెక్కుతున్నారు లంచాలు' అన్నాడు బకాసురుడు.

'బదిలీలు చెయ్యాలంటే లంచం, పింఛను రావాలంటే లంచం, బిల్లుల మంజూరుకు, వైద్యానికి, పక్కా ఇళ్లకు, టీసీలు ఇవ్వడానికి, ఆఖరికి మరుగుదొడ్లకూ... లంచాల కక్కుర్తే. పట్టణాలు, నగరాల్లో కొత్తగా ఇళ్లు కట్టుకునేవాళ్లను ఒక్కసారి అడిగి చూడండి... లంచావతారుల విశ్వరూపం మీ కళ్లముందు బొమ్మకడతారు. దాని ముందు శ్రీకృష్ణుడి విశ్వరూపం కూడా బలాదూరే! వీళ్ల ఆకలి విశ్వమంత, నోరు భూగోళమంతయ్యా స్వామీ' అన్నాడు కిమ్మీరుడు. ఆ మాటలకు ధర్మరాజు నోరెళ్లబెడుతూ 'ఇవన్నీ మీకెలా తెలుసు?' అన్నాడు.

'భలేవారే... వాళ్లందరూ మా నరకానికేగా వస్తారు! పెద్ద పెద్ద లైన్లు... శిక్షలు వెయ్యలేక యమధర్మరాజు దేవుడో రాముడో అంటున్నాడు. ఆయన అలసిపోయి కునుకుతీస్తుంటే చాటుగా ఇలా వచ్చాం. కనీసం దేవుడి సొమ్మునైనా వదలట్లేదయ్యా అవినీతి అధికారులు. పైగా ఆ 'దొంగ' సొమ్మును బాత్‌రూముల్లో, టైల్సలో అద్దమైన చోట్లా దాచిపెడుతున్నారు. వాళ్లతో పోలిస్తే మేమే నయమయ్యా బాబూ, బతికినన్నాళ్లూ దర్జాగా బతికాం' అన్నాడు హిడింబాసురుడు.

'అయితే ఇప్పుడేమంటారు' అర్థంకానట్టు అడిగాడు ధర్మరాజు.

'మళ్లీ ఏంటి అంటావేంటి స్వామీ! మహా అయితే మేము ఏం చేశామయ్యా. ఆకలికి ఇంత తిన్నాం. ఇప్పటి అవినీతి అధికారుల్లాగా వందల స్థలాలు, కిలోల్లెక్కన బంగారం కొన్నామా? అపార్టుమెంట్లు కట్టామా? సామాన్యులకు అందకుండా భూముల ధరలు వీళ్లవల్ల కాదూ పెరిగిపోతోంది? ఆర్థిక అసమానతలు అధికమవడానికి వీళ్లు కాదూ కారణం? పైగా భూములు కబ్జాలు చేస్తున్న వాళ్లకు 'భూ బకాసురులు' అని పత్రికల్లో హెడ్డింగులు పెడుతున్నారయ్యా? నా గుండె ఎంత తరుక్కుపోతోందో తెలుసా' కళ్లు తుడుచుకుంటూ అన్నాడు బకాసురుడు.

'ఈ అవినీతి అధికారులకి 'ఉత్తమ సేవకులు' అని ధ్రువపత్రాలూ ఇస్తున్నాయి ప్రభుత్వాలు! భారీగా జీతాలు తీసుకుంటూ నిర్లజ్జగా లంచాలకు చేతులు చాస్తున్న వీళ్లు మనుషులేనా? అవగింజంత సందుంటే అరవై గారెలు తినినా అన్నాడట వెనకటికెవడో. వీళ్లు ఆ కాస్త సందులో బ్రహ్మాండాన్ని సైతం పట్టించెయ్యగలరు' అన్నాడు కిమ్మీరుడు.

'సరే, ఇప్పుడేమంటారు?' చివరిసారిగా అసహనంగా, కటువుగా అడిగాడు భీముడు.

'చెప్పు, మమ్మల్ని చంపినందుకు క్షమాపణ చెప్పు. భూమ్మీద అవినీతి అధికారులకన్నా మేమే నయమని ఒప్పుకో. ఆ ఇంద్రుణ్నడిగి మమ్మల్ని కూడా స్వర్గానికి రప్పించు' అన్నారు ముగ్గురూ.

భీమ ధర్మజులకు ఏం చెప్పాలో అర్థంకాలేదు. అంతలో యముడి మహిషపు లోహగంటలు ఖణేల్‌మన్నాయి. యముడి పాశం ఒక్కసారిగా ఆ ముగ్గురి మెడలకూ చుట్టుకుంది. అమాంతం కాలుడు తీసుకెళ్లిపోతుంటే... ధర్మరాజా, భీమా అంటూ అరుస్తున్నారు వాళ్లు. కాసేపటికి ఆ మాటలు గాలిలో కలిసిపోయాయి. స్వర్గంలో రంభ, ఊర్వశి, మేనక మళ్లీ నృత్యం అందుకున్నారు.

– వేణుబాబు మన్నం

---

# విజయోత్సవం

అపజయాల్ని పట్టించుకోవద్దు. అవి అత్యంత సహజం. ఒక్కోసారి అపజయాలే జీవితానికి అందాన్ని ఇస్తాయి. అవి లేకుండా జీవితంలో ఏమీలేదు. పోరాటాలు లేని జీవితం అసలు జీవించదగినదే కాదు. జీవితంలో నవరసాలు ఉంటాయి. బాధలే కీలకం. ఏ విజయచరిత్రలోనూ అపజయం పాత్ర లేకుండా పోదు. అపజయాల స్తంభాలమీద విజయభవనం నిలిచి ఉంటుంది.

ఎన్నో అపజయాలను చూసి, పనిలోనే విశ్రాంతి పొందుతూ ప్రయోగశాలలోనే నిద్రపోయిన థామస్ అల్వా ఎడిసన్ చివరకు లోకాన్ని వెలుగులతో నింపాడు. పనికిరాదనుకున్న నాచు పెన్సిలిన్‌గా మారి లోకరక్షకురాలవుతుందని ఫ్లెమింగ్ కలగనలేదు. విజేతలందరి చేతుల్లో విజయాలు మాత్రమే రేఖలుగా గీసిలేవు. అపజయాల అష్టవంకరలు ఎన్నో ఉన్నాయి. వాళ్లు చేతుల్నికాక చేతల్ని నమ్మారు. జీవనగతిని మార్చుకున్నారు. విధిని ఎదిరించారు.

ప్రయత్నించకపోవడమే పెద్ద లోపం. రింగులోలేని ఆటగాడు ఎన్నడైనా గెలిచాడా? మనసులో విజయాన్ని స్పష్టంగా చూడనివాడు జయకేతనం ఎగురవెయ్యలేడు. గెలుపు తర్ఫీదు పొందినవాడు మొదట మనసును జయిస్తాడు. ఆ తరవాత ప్రత్యర్థులను జయిస్తాడు. అర్జునుడికి ఈ స్పష్టత ఇవ్వడానికే శ్రీకృష్ణుడు సర్వప్రయత్నాలూ చేశాడు. విజయం సాధించాడు!

వదలొద్దు. వదిలితే గెలవలేవు. వదిలితే విజయం నీది కాదు. వదిలినవాడు ఎన్నటికీ గెలవలేడు. పట్టే విడవరాదు. పట్టి విడుచుట కంటే పడిచచ్చుట మేలు అన్నాడు బమ్మెర పోతన. తన ప్రయోజనం కోసం రావణాసురుడు కూడా పట్టుదలతో వెయ్యి సంవత్సరాలు తపస్సు చేసి శివుణ్ని మెప్పించాడు. మహా శివభక్తుడని అనిపించుకున్నాడు. కైలాసాన్ని కదిలించాడు. విజయం సాధించాడు. 'గెలవాలని అనుకోకపోతే అది నీ ఇష్టం, అనుకుంటే గెలుస్తావు... నువ్వు ఏదంటే అది జరుగుతుంది' అన్నాడు హెన్రీ ఫోర్డ్. సంకల్ప బలానికి మించింది లేదని మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి.

అపజయాన్ని అసలు నమ్మకు. విజయానికి మారురూపమైన నన్ను నమ్ము అని చెప్పకనే చెప్పాడు శ్రీకృష్ణుడు. బలహీనుడిగా మారిపోతున్నవాడిని మహాబలవంతుడిగా చేశాడు. అప్పుడు విజయం అంటే ఏమిటో, వీరస్వర్గం అంటే ఏమిటో, మరణ రహస్యం ఏమిటో, దాని కీలకం ఏమిటో క్షుణ్ణంగా తెలుసుకున్నాడు అర్జునుడు.



### అంతర్యామి

అడ్డులు, అవరోధాలు లేని ప్రయాణం బ్రహ్మపుత్రుడికైనా లభించదు. సీతాన్వేషణలో భగవంతుడైన శ్రీరాముడు లంకను దాటడానికి సముద్రుణ్ని ప్రార్థించవలసి వచ్చింది. మహా శక్తిమంతురాలు, జగజ్జనని అయిన సీతమ్మ అశోకవనంలో కాలం గడపవలసి వచ్చింది. అపజయానికి వ్యతిరేక పదమైన హనుమంతుడు లంకలో సవాలక్ష చిక్కుల్ని ఎదుర్కోవలసి వచ్చింది.

బంగారుపళ్లెంలో పెట్టి, ఎర్ర తివాచి పరచి, మన ముందుకు తీసుకువచ్చి విజయాన్ని ఎవరూ వినయంగా నిలబడి ఇవ్వరు. ఒకవేళ ఇచ్చినా అది విజయం కాదు. అది ఒక భ్రమ అయి ఉంటుంది. నిజమైన విజయాన్వేషి దాన్ని తెలుసుకోవాలి. విజయానికి సూత్రాలు, సిద్ధాంతాలు ఉన్నా అది పూలబాట కాదు. రహదారి అసలు కానేకాదు.

రథం కురుక్షేత్రం మధ్యలోకి నడిపించకుండా ఇంటి దగ్గర అర్జునుడికి ఎన్ని బోధలు చేసినా విజేత కాలేడు. ఎదురు వెళ్లాలి. రణరంగంలోకి దూకాలి. ఎదుర్కోవాలి. అపజయాలు ఎదురొచ్చినా స్వీకరించడానికి సిద్ధపడాలి. విషాద భారాన్ని మోయాలి. మానసిక ఆటుపోట్లకు కుంగిపోకూడదు. విజయం రాసిపెట్టి ఉన్నా, దాని కోసం పడాల్సిన కష్టం కూడా రాసిపెట్టి ఉంటుందని మరిచిపోకూడదు.

భూమ్మీదకు మనిషి వచ్చింది విజయోత్సవాలు చేసుకుంటూ బతకడానికి. సత్యం తెలుసుకొని కీర్తి పొందడానికి. ఏం కావాలో స్పష్టంగా తెలిసిన తరవాత మన అడుగులు విజయంవైపే పడతాయి!

– ఆనందసాయి స్వామి




# కశ్మీరం కొత్త సమీరం

## షా ప్రకటనలో కీలక భాగమిదీ

జమ్మూ-కశ్మీర్ రాష్ట్రంలోని లద్దాఖ్ డివిజన్ విస్తీర్ణంపరంగా పెద్దది. కానీ, అక్కడ జన సాంద్రత తక్కువ. భౌగోళికంగా అది సంక్లిష్ట ప్రాంతం. తమ ఆకాంక్షలు ఫలించేలా తమ ప్రాంతానికి కేంద్రపాలిత ప్రాంత హోదా కల్పించాలంటూ లద్దాఖ్ ప్రజలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నారు. చట్టసభ లేని కేంద్రపాలిత ప్రాంతంగా లద్దాఖ్ ఉంటుంది. జమ్మూ-కశ్మీర్‌లో సీమాంతర ఉగ్రవాదం కారణంగా అంతర్గత భద్రతకు ఎదురవుతున్న సవాళ్లను దృష్టిలో పెట్టుకొని, విడిగా జమ్మూ-కశ్మీర్‌ను చట్టసభతో కూడిన కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పాటుచేస్తున్నాం.

## మరువలేని అన్యాయాలను మనముందుంచారు!

### అమిత్‌షా ప్రసంగాన్ని ప్రశంసిస్తూ ప్రధాని ట్వీట్

"రాజ్యసభలో సోమవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా గతంలో జరిగిన మరువలేని అన్యాయాలను తన ప్రసంగంలో మనముందుంచారు. మున్ముందు జమ్మూ-కశ్మీర్ సోదర సోదరీమణుల కోసం చేపట్టదలచిన చర్యలను... కేంద్రం విజన్‌ను కళ్లకు కట్టారు. అమిత్ షా తన ప్రసంగంలో వెలిబుచ్చిన అభిప్రాయాలు విస్పష్టంగా ఉన్నాయి".

## మెహబూబా ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా అరెస్టు

జమ్మూ: జమ్మూ-కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు మెహబూబా ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లాలను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వీరిద్దరినీ ఆదివారం అర్ధరాత్రి గృహ నిర్బంధంలోకి తీసుకున్న సంగతి తెలిసిందే. జమ్మూ-కశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్ నేతలు సజ్జాద్ లోన్, ఇమ్రాన్ అన్సారీ సహా మరికొందరిని కూడా అరెస్టు చేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.



# పాపాల భైరవి 370

- అన్ని దురవస్థలకూ కారణం ఆ అధికరణమే
- భూలోక స్వర్గంలా జమ్మూ-కశ్మీర్ విలసిల్లుతుంది
- అనుకూల పరిస్థితులు వచ్చాక రాష్ట్రహోదా కల్పిస్తాం
- రాజ్యసభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటన

**ఈనాడు, దిల్లీ:** జమ్మూ-కశ్మీర్‌లో అన్ని సమస్యలకూ రాజ్యాంగంలోని 370, 35-ఎ అధికరణాలు ప్రధాన కారణమని, అందుకే ఇచ్చిన మాటకు కట్టుబడి ఆ రెండింటికీ ముగింపు పలుకుతున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాద అంతానికి ఇంతకుమించిన దారి మరొకటి లేదని చెప్పారు. 370వ అధికరణం ఆ రాష్ట్రంలోని మూడు కుటుంబాలకు తప్ప ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదని ధ్వజమెత్తారు. జమ్మూ-కశ్మీర్ విభజన, ఆర్టికల్ 370, 35-ఎ రద్దుపై సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చకు అమిత్‌షా సుమారు 50 నిమిషాల పాటు సమాధానమిచ్చారు.

### ఇన్ని ప్రాణాలు పోయేవే కావు

'జమ్మూ-కశ్మీర్‌లో రక్తపాతం కారణంగా 1959 నుంచి ఇప్పటివరకూ 41,839 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆర్టికల్ 370 లేకపోతే ఇంతమంది ప్రాణాలర్పించాల్సిన అవసరం ఉండేది కాదు. ఇదెక్కడి అన్యాయం? దేశం కోసం మాట్లాడేవారు సమాధానం చెప్పాలి. శ్రీనగర్ లోయలోని గ్రామాల్లో హృదయం ద్రవించే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజలు, విద్యార్థులు వలసలు వెళ్లాల్సి రావడానికి ప్రధాన కారణం ఆర్టికల్ 370యే. అది ఉగ్రవాదానికి ప్రధాన కారణం కూడా. దేశంలో స్థానిక స్వయంపాలన కోసం రాజీవ్‌గాంధీ తీసుకొచ్చిన 73, 74 రాజ్యాంగ సవరణలు జమ్మూ-కశ్మీర్‌లో అమలుకాలేదు. 70 ఏళ్లపాటు స్థానిక సంస్థలకు అధికారాలు లేకుండా చేసినందుకు ఎవరు బాధ్యత తీసుకుంటారు? ఇప్పటివరకూ వీటి గురించి మాట్లాడని పార్టీలు ఇప్పుడు మా బిల్లును ఓటుబ్యాంకు రాజకీయంగా అభివర్ణిస్తున్నాయి.

### ఎకరా రూ.30 వేల లోపే

స్వాతంత్ర్యం వచ్చినప్పుడు దేశంలో ప్రతి ఎకరా సగటు ధర రూ.3,000 ఉండేది. ఇప్పుడు దేశంలో చాలా చోట్ల ఎకరం రూ.10 లక్షల నుంచి రూ.3కోట్ల వరకు ఉంది. జమ్మూకశ్మీర్‌లో మాత్రం రూ.3వేల నుంచి రూ.30వేలు దాటడంలేదు. ఆర్టికల్ 370 వల్ల ఎవరూ భూములు కొనలేని పరిస్థితులుంటే ధరలు ఎలా పెరుగుతాయి? భూములున్నవారిని ఎందుకు అమ్ముకోనివ్వలేదు? కశ్మీర్ లోయ, లద్దాఖ్‌లు భూలోక స్వర్గాలని అందరూ అంటారు. కొండలు, లోయలు, సెలయేర్లు, జలాశయాలు, మంచు అక్కడ ఉన్నప్పటికీ పర్యాటకం అభివృద్ధి చెందలేదు. కారణం అక్కడ భూములుకొని హోటళ్లు కట్టే పరిస్థితి లేకపోవడమే. పరిశ్రమలు రాకపోతే నిరుద్యోగం ఎలా పోతుంది? ఇప్పుడున్న నిబంధనల కారణంగా అక్కడ ప్రైవేటు విద్యాసంస్థలు రావడం లేదు. ఆర్టికల్ 370, 35ఎ రద్దు చేస్తున్నందున జమ్మూ-కశ్మీర్ భారత్‌లో సంపూర్ణ భాగం అవుతుంది. ఇప్పటివరకూ పార్లమెంటులో ఆమోదించిన చట్టాలేవీ అక్కడ నేరుగా వర్తించలేదు. ఇప్పటివరకూ జమ్మూ-కశ్మీర్ మహిళ పరాయి రాష్ట్రాలకు చెందిన వ్యక్తిని పెళ్లిచేసుకుంటే వారి పిల్లలకు అక్కడ హక్కులు లభించేవి కావు. ఈ బిల్లు తర్వాత దేశంలో ఎక్కడ పెళ్లి చేసుకున్నా ఆ రాష్ట్రంలో వారికి సంపూర్ణ హక్కులు దక్కుతాయి.

### అభివృద్ధి చేసి చూపుతాం

మున్సిపల్ కౌన్సిలర్‌గానైనా గెలవలేని ఎన్నికల్లోనూ మేం ఆర్టికల్ 370 రద్దు గురించి మేనిఫెస్టోల్లో హామీ ఇస్తూ వచ్చాం. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నాం. భారత్‌కు జమ్మూ-కశ్మీర్ మకుటాయమానం. ఎప్పుడు అనుకూల పరిస్థితులు వచ్చినా దానికి రాష్ట్ర హోదా కల్పిస్తాం. 370ని అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ 70 ఏళ్లుగా ప్రజలను మోసగిస్తోంది. మాకు అయిదేళ్లు అవకాశం ఇవ్వండి. దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా జమ్మూ-కశ్మీర్‌ను నిరూపించి చూపుతాం. అయిదేళ్లలో పరివర్తన రావడం ఖాయం. జమ్మూ-కశ్మీర్‌కు అంతిమ పరిష్కారం చూపించడానికి కొంత సమయం పడుతుంది. అందుకు దారి మాత్రం 370 రద్దుతోనే సాధ్యం. ప్రజలంతా 370 రద్దునే కోరుకుంటున్నారు. భవిష్యత్తులో ఎన్ని సవాళ్లనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం' అని అమిత్‌షా ప్రకటించారు.

> దేశ విభజన తర్వాత భారత్‌లోని వివిధ రాష్ట్రాలకు పాకిస్థాన్ నుంచి ఎంతోమంది శరణార్థులుగా వచ్చారు. ఎంతోమంది జమ్మూకశ్మీర్‌కూ వెళ్లారు. ఆ రాష్ట్రానికి శరణార్థులుగా వెళ్లిన పాకిస్థానీలకు ఇప్పటివరకూ అక్కడ పౌరసత్వం ఇవ్వలేదు. ఈ దేశానికి శరణార్థులుగా వచ్చిన మన్మోహన్‌సింగ్, ఐకే గుజ్రాల్‌లు మనకు ప్రధానులుగా పనిచేయగా, జమ్మూకశ్మీర్‌కు వెళ్లినవాళ్లు మాత్రం కనీసం కౌన్సిలర్ కాలేని పరిస్థితి ఉండటానికి కారణం ఏంటి?

> ఈ బిల్లును వ్యతిరేకించే వేర్పాటువాదుల పిల్లలంతా లండన్, అమెరికాల్లో చదువుకుంటున్నారు. అలా కాకుండా ఆ రాష్ట్రంలోని స్కూళ్లలో చదివి ఉంటే... ఆర్టికల్ 370 వల్ల నష్టమేంటో వాళ్లకు తెలిసి వచ్చేది. ఆర్టికల్ 370, 35ఎ ఉన్నంత కాలం కశ్మీర్‌లో ఉగ్రవాదం అంతం కాదు. ఆ పనిచేయడానికే మేం వాటిని రద్దు చేస్తున్నాం.

> ఆర్టికల్ 370 క్రమంగా కాలగర్భంలో కలిసిపోతుందని జవహర్‌లాల్ నెహ్రూ చెప్పారు. అది కాలగర్భంలో కలిసిపోకుండా 70 ఏళ్లయినా అట్టే పట్టుకొంది. ఈ అధికరణం తాత్కాలికం అని అందరూ అంగీకరిస్తున్నారు. తాత్కాలికం అంటే 70 ఏళ్లయినా పోకపోవడమా?

### మత రాజకీయాలు కాదు

కశ్మీర్ లోయలో ముస్లింలే కాకుండా అన్ని మతాల ప్రజలు నివసిస్తున్నారు. మేం ఇక్కడ మత రాజకీయాలు చేయడంలేదు. మూడు కుటుంబాలు జమ్మూ-కశ్మీర్‌లో ప్రజాస్వామ్యం పరిఢవిల్లకుండా చేశాయి. అక్కడి ప్రజలు స్థానిక సంస్థల ప్రతినిధులను 50%కి పైగా ఓట్లతో గెలిపించి కశ్మీరీలు ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటున్నట్లు నిరూపించారు. జమ్మూ-కశ్మీర్ పేదరికానికి ఆర్టికల్ 370యే కారణం. 2004 నుంచి 2019 వరకు భారత ప్రభుత్వం రూ.2.77 లక్షల కోట్లు జమ్మూ-కశ్మీర్‌కు ఇచ్చింది. నరేంద్రమోదీ ప్యాకేజీకి ఇది అదనం. కానీ అక్కడ అభివృద్ధే జరగలేదు. దానికి కారణం అవినీతిని నియంత్రించే సంస్థలకు అక్కడ ప్రవేశం లేకపోవడమే. మూడు కుటుంబాలను అంటిపెట్టుకున్నవారు తప్ప అక్కడ వేరే ఎవ్వరూ వ్యాపారాలు చేసే పరిస్థితి లేదు.

### రిజర్వేషన్లూ అమలు కాలేదు

దళితులు, ఆదివాసీలకు ఆర్టికల్ 370 వ్యతిరేకం. అక్కడ ఓబీసీలకు ఇంతవరకూ రిజర్వేషన్లే అమలుకాలేదు. దళితులు, ఆదివాసీలకు రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వలేదు. కొన్నిపార్టీలు ఎన్జీవోల ద్వారా ఈ బిల్లును సుప్రీంకోర్టులో సవాల్ చేయడానికి కుట్ర పన్నుతున్నాయి. నేను చెప్పేదొక్కటే... ఈ బిల్లు ఏ న్యాయ సమీక్షకైనా నిలబడుతుంది. ఎలాంటి అనుమానం అవసరంలేదు. ఆర్టికల్ 370ని బూచిగా చూపి అక్కడి నిరుద్యోగ యువతలో దేశం పట్ల విద్వేషపూరిత వాతావరణం సృష్టించారు. పాకిస్థాన్ దాన్ని ఉపయోగించుకొని దేశంలో ఉగ్రవాదాన్ని పెంచి పోషించింది. నెహ్రూ తీసుకున్న విధానాలను ఇప్పటివరకూ ఎవ్వరూ మార్చుచేయలేదు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థలు దేశవ్యాప్తంగా ఉగ్రవాదాన్ని విస్తరింపజేయాలనుకున్నా జమ్మూ-కశ్మీర్‌లో తప్ప మిగతా రాష్ట్రాల్లో 370 అధికరణం లేకపోవడంవల్ల వేర్పాటువాదుల ఎత్తులు పారలేదు. భారత్‌లోని మిగతా చోట్ల జరిగే అభివృద్ధి ఆ రాష్ట్రంలోనూ కొనసాగాలంటే అడ్డంకి తొలగించడం అత్యవసరం. సర్దార్ పటేల్ ఎప్పుడూ జమ్మూ-కశ్మీర్‌ను పాకిస్థాన్‌కు ఇవ్వాలనుకోలేదు. ఇప్పుడు 370 రద్దుకాకపోతే జమ్మూ-కశ్మీర్ నుంచి ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టలేం.

# ఏవేం మారతాయి?

- అందరికీ ఆస్తులు కొనే హక్కు
- సమాచార హక్కు చట్టం అమలు

దిల్లీ: జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 అధికరణాన్ని కేంద్రప్రభుత్వం నిష్ఫలం చేసి, రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. దీనివల్ల అక్కడ ఏయే అంశాలు మారుతాయంటే..

### ఒకటే రాజ్యాంగం



గతంలో దేశం మొత్తమ్మీద జమ్మూ-కశ్మీర్‌కు మాత్రమే ప్రత్యేకంగా రాజ్యాంగం ఉండేది. ఇప్పుడు దాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం నిష్ఫలం చేసింది. ఇపుడు ఇక్కడా దేశంలోని ఇతర ప్రాంతాలకు వర్తించినట్లే భారత రాజ్యాంగం వర్తిస్తుంది.

### ఆస్తులు కొనే హక్కు

370 అధికరణం ఆధారంగా ఏర్పడిన 35ఎ అధికరణం వల్ల జమ్మూ-కశ్మీర్ రాష్ట్ర శాసనసభ అక్కడి శాశ్వత నివాసులెవరో నిర్వచించి, వారికి ప్రత్యేకహక్కులు కల్పిస్తుంది. ఇపుడు ఈ రెండు అధికరణలూ నిష్ఫలం కావడంతో ఈ రాష్ట్రానికి చెందనివారు కూడా అక్కడ ఆస్తులు కొనుగోలు చేసి, స్థిరపడొచ్చు.

### శాంతిభద్రతలు

శాంతిభద్రతలు రాష్ట్రప్రభుత్వ ఆధీనంలో ఉండేవి. ఇపుడు రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించడంతో శాంతిభద్రతల యంత్రాంగాన్ని పునర్నిర్మిస్తారు. దిల్లీ లేదా పుదుచ్చేరి తరహాలో అధికార పంపిణీ జరిగే అవకాశముంది. దిల్లీలో శాంతిభద్రతలు కేంద్రప్రభుత్వ నియంత్రణలో ఉంటే.. పుదుచ్చేరిలో అవి రాష్ట్రప్రభుత్వం చేతుల్లో ఉన్నాయి.

### కేంద్ర చట్టాలు

ఇన్నాళ్లూ కేంద్రప్రభుత్వం తాము చేసిన చట్టాలు అమలుచేయాలంటే రాష్ట్ర శాసనసభ అనుమతి తీసుకోవాల్సి వచ్చేది. ఇపుడు కేంద్ర చట్టాలు స్వతస్సిద్ధంగా రాష్ట్రానికి అమలవుతాయి.

### ప్రత్యేక జెండా

370 అధికరణం జమ్మూ-కశ్మీర్ రాష్ట్రానికి జాతీయజెండాతో పాటు తమ సొంత జెండా కలిగి ఉండే హక్కు కల్పించింది. ఇపుడు రాష్ట్రానికి సొంత జెండా ఉండాలా.. వద్దా అన్న విషయాన్ని పార్లమెంటు నిర్ణయిస్తుంది.

### ప్రత్యేకాధికారాలు

రాష్ట్రానికి ఇంతకుముందు ఉన్న ప్రత్యేకాధికారాలు ఇప్పుడు పోతాయి.

### ద్వంద్వ పౌరసత్వం

అక్కడి పౌరులకు జమ్మూ-కశ్మీర్ పౌరసత్వం, భారత పౌరసత్వం ఉండేవి. ఇక మీదట వారంతా భారత పౌరులే.

### 360 అధికరణం

ఆర్థిక అత్యయిక పరిస్థితి విధించే 360 అధికరణం అమలవుతుంది. ఇది ఇంతకుముందు అమలయ్యేది కాదు.

### మైనారిటీలకు రిజర్వేషన్లు

గతంలో జమ్మూ-కశ్మీర్‌లో మైనారిటీలకు రిజర్వేషన్లు అమలులో లేవు. ఇక మీదట అవి అమలవుతాయి.

### సమాచార హక్కు చట్టం

ఇన్నాళ్లుగా దేశవాసుల చేతిలో బ్రహ్మాస్త్రంగా ఉపయోగపడిన సమాచార హక్కు చట్టం జమ్మూ-కశ్మీర్‌లో అమలులో లేదు. 370 అధికరణం నిష్ఫలం కావడంతో ఆ చట్టం సైతం ఆ ప్రాంతవాసులకు అందుబాటులోకి వస్తుంది.

### శాసనసభ్యుల పదవీకాలం



దేశంలోని మిగిలిన అన్ని రాష్ట్రాల్లో శాసనసభ్యుల పదవీకాలం అయిదేళ్లు, మండలి సభ్యులకు ఆరేళ్లు ఉండగా.. జమ్మూ-కశ్మీర్‌లో మాత్రం శాసనసభ్యులకూ ఆరేళ్లు ఉండేది. ఇక కేంద్రపాలిత ప్రాంతంలో శాసనసభ్యుల పదవీకాలం అయిదేళ్లే ఉండనుంది.

## ముఖర్జీ కల నిజమైన వేళ



శ్యామాప్రసాద్ ముఖర్జీ.. భాజపాకు పూర్వరూపమైన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు. జీవిత పర్యంతం జమ్మూ-కశ్మీర్ విలీనం కోసం ఉద్యమించారు. రాజ్యాంగంలోని అధికరణం 370ని తీవ్రంగా వ్యతిరేకించారు. జమ్మూ-కశ్మీర్‌ను సంపూర్తిగా భారత యూనియన్‌లో విలీనం చేయాలనేది ఆయన కల. దానికోసం ఉద్యమిస్తూనే ప్రాణాలు వదిలారు. ఎట్టకేలకు ఇన్నేళ్లకు అధికరణం 370ని రద్దు చేయడం ద్వారా భాజపా ముఖర్జీ కలలను సాకారం చేసినట్లుగా భావిస్తున్నారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ బెంగాలీ. న్యాయవాది. విద్యావేత్త. సర్ అశుతోష్ ముఖర్జీ తనయుడు. నెహ్రూ మంత్రివర్గంలో ఒకసారి మంత్రిగా కూడా పనిచేశారు. జమ్మూ-కశ్మీర్ సహా పలుఅంశాలపై నెహ్రూతో విభేదించి మంత్రిపదవిని వదులుకున్నారు. 1951 అక్టోబర్ 21న జనసంఘ్‌ను స్థాపించారు. జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక రాయితీలేమీ లేకుండా భారత్‌లో కలిపెయ్యాలని ఒత్తిడి చేశారు. కనీసం జమ్మూ, లద్దాఖ్‌లనైనా భారత్‌లో సంపూర్ణంగా విలీనం చేయాలని డిమాండ్ చేశారు. జనసంఘ్ కార్యకర్తలు, హిందూమహాసభ, రామరాజ్య పరిషత్‌లతో కలిసి ఉద్యమించారు. 1953 మే 11న అనుమతి లేకుండా జమ్మూ-కశ్మీర్‌లోకి ప్రవేశించగా.. షేక్ అబ్దుల్లా నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేసి శ్రీనగర్ జైలులో ఉంచింది. జూన్ ప్రారంభంలో ఆయన అనారోగ్యం బారిన పడ్డారు. జూన్ 22న గుండెపోటు వచ్చింది. జూన్ 23న మరణించారు.




## వాగ్దానం నెరవేర్చారు..


కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసిన కొద్దిసేపటికే ప్రధాని నరేంద్ర మోదీకి చెందిన ఒకప్పటి చిత్రం విశేష ప్రాచుర్యం పొందింది. జమ్మూకశ్మీర్‌పై ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశంసిస్తూ భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ ఈ చిత్రాన్ని ట్వీట్ చేశారు. 'వాగ్దానం నెరవేర్చారు' అంటూ ట్వీట్ చేశారు. మోదీ అప్పట్లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఈ చిత్రంలో ఆయన వెనుక "370 అధికరణం తొలగించాలి, ఉగ్రవాదాన్ని రూపుమాపాలి, దేశాన్ని కాపాడాలి." అంటూ బ్యానర్ ఉంది.

## ప్రణాళిక రచించారు..

జమ్మూ-కశ్మీర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేసిన వెంటనే ఆయనకు చెందిన ఓ చిత్రం (ఫొటో) అందరినీ విశేషంగా ఆకర్షిస్తోంది. మంత్రి సోమవారం ఉదయం పార్లమెంటులోకి వెళుతుండగా తీసిన ఈ చిత్రంలో.. జమ్మూ-కశ్మీర్‌పై ప్రభుత్వ సవివరమైన ప్రణాళికతో కూడిన పత్రాలు ఆయన రెండు చేతుల్లో ఉన్నాయి. రాజ్యాంగ, రాజకీయ, శాంతిభద్రతలకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రణాళికలు (రాష్ట్రపతికి నివేదించడం, కేబినెట్ సమావేశం, రాష్ట్రపతి ప్రకటన, పార్లమెంటులో బిల్లు ఆమోదం, జమ్మూకశ్మీర్‌కు హోం కార్యదర్శిని పంపించడం వంటి వివిధ అంశాలు) ఆ పత్రాల్లో ఉన్నాయి.



# అయ్యంగార్ విరచితం!



దిల్లీ: జమ్మూ-కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని సొంతం చేసిన 370 అధికరణం...రూపకల్పన వెనక నాడు ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి.

- డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 370 అధికరణం రూపకల్పనకు నిరాకరించారు. దాంతో నాటి జమ్మూ-కశ్మీర్ సంస్థానాధీశుడు మహారాజా హరిసింగ్ వద్ద దివానుగా ఉన్న గోపాల స్వామి అయ్యంగార్‌కు ఆ అవకాశం దక్కింది. 370 అధికరణం సృష్టికర్తగా చరిత్రలో నిలిచిపోయారు.
- 1937-1943 మధ్య కాలంలో గోపాలస్వామి అయ్యంగార్ కశ్మీర్ ప్రధాన మంత్రిగా పనిచేసిన అనుభవమూ కలిసివచ్చింది. ఆయన భారత తొలిప్రధాని నెహ్రూకు అత్యంత విశ్వాసపాత్రుడు కూడా. భారత రాజ్యాంగ రూపకల్పన కమిటీలో అయ్యంగార్ కూడా సభ్యుడు.
- కశ్మీర్ సమస్యపై గతంలో ఐక్యరాజ్య సమితిలో భారత ప్రతినిధి బృందానికి సారథ్యం వహించారు.
- ఈ అధికరణం రచన నల్లేరు మీద బండి నడకలా ఏమీ సాగలేదు. కశ్మీర్ సీనియర్ నాయకుడు షేక్ అబ్దుల్లాకు, అయ్యంగార్‌కు ఎన్నో అంశాలపై తీవ్ర భేదాభిప్రాయాలే తలెత్తాయి. ఈ నేపథ్యంలో అయ్యంగార్ సర్దార్ పటేల్‌ను ఆశ్రయించారు.
- చర్చలు...వాదోపవాదాలు...భిన్నాభిప్రాయాలు...కోపతాపాలు...అలకలు...సర్దుబాట్లు..ఇలా అనేకానేక పరిణామాల అనంతరం 370 అధికరణం ఊపిరిపోసుకుంది.
- అయ్యంగార్ దక్షిణాదికి చెందిన సివిల్ సర్వీసెస్ అధికారి. 1882లో ప్రస్తుత తమిళనాడులోని తంజావూరులో జన్మించారు. 1937లో ఆయనను 'దివాన్ బహదూర్' టైటిల్‌తో బ్రిటిష్ వైస్రాయ్ గౌరవించారు. 1941లో కింగ్‌జార్జి-6 నుంచి 'నైట్‌హుడ్' గౌరవాన్ని పొందారు.

### వెతకబోయిన తీగ

# '370'లోనే దొరికింది

దిల్లీ: 370వ అధికరణం జమ్మూ-కశ్మీర్‌లో అమలు కాకుండా చేసే నిబంధన కోసం మోదీ సర్కారు.. రాజ్యాంగంలో ఎక్కడెక్కడో వెతకాల్సిన అవసరం కలగలేదు. అదే అధికరణంలో మూడో సెక్షన్ కింద ఉన్న ఒక నిబంధన ప్రభుత్వానికి ఉపయోగపడింది.

### ఎందుకు రద్దు చేయలేదు?

'370'అధికరణాన్ని రద్దు చేయడం అంత సులువు కాదు. 368 అధికరణం కింద రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుంది. ఈ అంశంపై సుప్రీం కోర్టులో దాఖలైన దావాలు కూడా ఇందుకు ప్రతిబంధకమయ్యాయి. ఈ నేపథ్యంలో '370'లోని మూడో సెక్షన్ మోదీ సర్కారుకు వరంగా మారింది. రాజ్యాంగ సవరణ అవసరాన్ని అది తప్పించింది. అందువల్లే ఆ అధికరణాన్ని రద్దు చేయడంలేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిర్దిష్టంగా రాజ్యసభలో చెప్పారు.

### 3వ సెక్షన్‌లో ఏముంది?

'370'లోని 3వ సెక్షన్ సారాంశం ప్రకారం.. 'ఈ అధికరణంలో ఉద్ఘాటిస్తున్న అంశాల మాటెలా ఉన్నా ఒక బహిరంగ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రపతి ఈ అధికరణాన్ని క్రియారహితం చేయవచ్చు. లేదా కొన్ని మినహాయింపులు, సవరణలతోనే దాన్ని అమలు చేయవచ్చు."

- 370 అధికరణం చెల్లుబాటులో లేకుండా చేయడానికి పార్లమెంటు ఆమోదం పొందాల్సిన అవసరాన్ని కూడా 3వ సెక్షన్ తప్పించింది. అందువల్ల రాష్ట్రపతి నోటిఫికేషన్ ద్వారా ఆ పనిని కేంద్రం పూర్తి చేసింది. దీనిపై గతంలో జారీ అయిన రాష్ట్రపతి ఉత్తర్వులను అధిగమించింది.
- ఇలాంటి ఆదేశాల జారీకి రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం అవసరం. ప్రస్తుతం జమ్మూ-కశ్మీర్‌లో అసెంబ్లీ రద్దయింది. రాష్ట్రపతి పాలన ఉంది.

